ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 30
సంచిక : 148
పేజీలు : 3
బుధవారం, ఫిబ్రవరి 18, 2026
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ



## బొగ్గుల శ్రీనివాస్‌ది హత్యే....?

### మృతిపై వీడుతున్న అనుమానాలు

**టి మీడియా,ఫిబ్రవరి 17,కూసుమంచి:** ప్రముఖ రచయిత, వివాదాస్పద వ్యక్తిత్వం వున్న బొగ్గుల శ్రీనివాస్(45) మృతిపై నేడో, రేపో మిస్టరీ వీడనుంది. ఇద్దరు వ్యక్తులు ప్రయాణిస్తున్న కారు ప్రమాదవశాత్తు పాలేరు జలాశయం లోకి దూసుకెళ్లినట్లు, అందులో ఒక వ్యక్తి మృత్యువాత, మరొక వ్యక్తి అదృష్టవశాత్తు తప్పించుకున్నట్లు పోలీసులకు రిపోర్ట్ అయిన కేసులో రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి, కూసుమంచి వృత్తలాధికారి సంజీవ్ నేతృత్వాన విచారణ ప్రారంభించిన సంగతి విదితమే. మొదట రోడ్డుప్రమాద కేసుగానే భావించినా కూడా నేర ప్రదేశంలోని ఆనవాళ్లు, మృతుడి శరీరంపై పదునైన ఆయుధపు గాయాలు, ఘటనలో డ్రైవర్ సీటులోని వ్యక్తి ప్రమాదం జరిగిన తరువాత ధరించిన దుస్తులను మార్చుకొని పారిపోవటం లాంటి విషయాలను పరిగణ లోకి తీసుకున్న పోలీసు బృందాలు కేసును ఛాలెంజ్ గా తీసుకున్నాయి. దీంతో ఆంధ్రా కు చెందిన, హైదరాబాద్ లో నివాసం ఉండే శ్రీనివాస్ ఇక్కడకు ఎందుకు వచ్చునట్లు, వచ్చినా జాతీయ రహదారిపై కాకుండా నాయకన్ గూడెం-కూసుమంచి రహదారిపై ఎందుకు ప్రయాణించినట్లు అనే విషయాలతో దర్యాప్తు మొదలుపెట్టి, ఇప్పటికే పూర్తి అంచనాకు పోలీసులు వచ్చినట్లు, ఇది ముమ్మాటికీ హత్యే అనే నిర్ధారణ తోనే కేసును కూడా ఆ సెక్షన్లు జోడించి హత్యకు గల కారణాలను అన్వేషిస్తున్నట్లు ఆయా మాధ్యమాల ద్వారా రిపోర్ట్ అవుతుంది ఇక నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రి లో నిర్వహించిన పోస్ట్ మార్టం లో కూడా మృతుడు బొగ్గుల శ్రీనివాస్ ఊపిరి తిత్తులలో ఎలాంటి నీరు లేదని, ఏదేని పదునైన ఆయుధం లేక సీసా లాంటి దానితో పొడిచి చంపిన తరువాతే ప్రమాదం గా చిత్రీకరించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తుంది. ఈ విషయాన్ని నిపుణులు ధృవీకరించక పోయినా ప్రాథమిక అంచనా ప్రకారం ముందు ఏదేని విషప్రయోగం చేసి, ఆరువాత ఆయుదం తో పొడిచేశారా, నేరుగానే ఆయుదం తో దాడిచేశారా అనేది నిర్ధారణ కావాల్సి ఉంది.అయితే ఈ ఘటనలో ఇప్పటికే ఒక వ్యక్తి ని విచారిస్తుండగా, కుటుంబ సభ్యుల ప్రమేయం తో పాటు, మరోకరి కోసం కూడా పోలీసులు గాలిస్తున్నట్లు, ఈ రోజు లేదా రేపటి లోగా దర్యాప్తు పూర్తి చేయనున్నట్లు తెలుస్తుంది.

## తొర్రూరు కాంగ్రెస్ కైవసం




### -కన్నీళ్లు పెట్టుకు ఎర్రబెల్లి

**టి మీడియా,ఫిబ్రవరి 17,తొర్రూరు :** ఉత్కంఠకు తెరదించుతూ తొర్రూరు మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మున్సిపల్ చైర్మన్ పదవి కోసం జరిగిన హోరాహోరీ పోరులో చివరకు అదృష్టం కాంగ్రెస్ అభ్యర్థిని వరించింది. అయితే, తన రాజకీయ కంచుకోటగా భావించే తొర్రూరు మున్సిపాలిటీ చేజారిపోవడంతో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర భావోద్వేగానికి లోనై మీడియా ముందే కన్నీళ్లు పెట్టుకున్నారు. చైర్మన్ ఎన్నిక ప్రక్రియలో ఇరు వర్గాల బలాబలాలు సమానంగా ఉండటంతో అధికారులు 'లక్కీ డ్రా' పద్ధతిని అనుసరించారు. ఈ డ్రాలో కాంగ్రెస్ అభ్యర్థి, రెండో వార్డు సభ్యుడు శ్రవణ్ కుమార్ విజేతగా నిలిచారు. దీంతో ఎన్నికల అధికారి ఆయన పేరును అధికారికంగా ప్రకటించి పత్రాన్ని అందజేశారు. మున్సిపాలిటీని దక్కించుకోవడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకుంటుండగా, బీఆర్ఎస్ క్యాంప్‌లో విషాదం నెలకొంది.ాయిత్ ్రాఖుఖుతీ ్రాశ్రీఖుఅవ జతీఖుంష్ట్ర: అజిత్ పవార్ విమాన ప్రమాద కేసులో బిగ్ ట్విస్ట్! బ్లాక్ బాక్స్ సమాచారంపై..!తొర్రూరులో బీఆర్ఎస్ ఓటమిని జీర్ణించుకోలేకపోయిన ఎర్రబెల్లి దయాకర్ రావు కార్యకర్తల కష్టాన్ని తలుచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. "ప్రాణాలకు తెగించి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు నేను ఇప్పుడు ఏం సమాధానం చెప్పాలి?" అంటూ ఆయన కంటతడి పెట్టారు. నాయకులు కేసీఆర్ అంటే ప్రజల్లో ఎంత అభిమానం ఉన్నా, అధికార పార్టీ సాగిస్తున్న అరాచకాలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీసుల వ్యవహారశైలిని ఎర్రబెల్లి తీవ్రంగా తప్పుబట్టారు. పోలీసులు కూడా అధికార పార్టీకి తొత్తులుగా మారి పనిచేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ప్రస్తుతం జరుగుతున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే దీనికి ముగింపు పడుతుందని ఆయన హెచ్చరించారు. బీఆర్ఎస్ శ్రేణులు ఈ సందర్భంగా 'జై తెలంగాణ' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.

## ముసలవ్వను నిలువు దోపిడి చేసిన కేటుగాళ్లు.



**టీ మీడియా, ఫిబ్రవరి 17, భూర్గంపాడు :** భూర్గంపాడు మండలం జింకల గూడెం గ్రామంలో జరిగిన సంఘటన ను విచారణ వేగవంతం చేసిన పోలీసులు. కుక్కునూరు మండలం నుండి బూర్గంపహాడ్ మండలానికి తీసుకు వచ్చి చోరీ.

కుక్కునూరు మండలం వేలేరు గ్రామానికి చెందిన లక్ష్మీకాంత 65 అనే మహిళా వృద్ధురాలు (బడ్డికొట్టు వ్యాపారం) రెండు రోజులు ఆశ్రయం కల్పించి అన్నం పెట్టిన వృద్ధురాలిని నమ్మపలికించి 2 బియ్యం బస్తాలు ఇస్తాం అవ్వ అంటూ ఈ నెల 14వ తేదీ వేలేరు గ్రామం నుండి బూర్గంపహాడ్ మండల కేంద్రానికి తీసుకు వచ్చి.. మండల పరిధిలోని జింకలగూడెం సీతారామ ప్రాజెక్ట్ సమీపంకి తీసుకువెళ్లిన దొంగ నాయాళ్ళు చంపుతాం అని బెదిరించి బంగారపు గొలుసు, చెవి దిద్దులు, కాళ్ళ పట్టీలు చోరీ చేశారు. అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డ ఆ వృద్ధ మహిళ ఈ సంఘటన పై బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ఎస్సై మేడ ప్రసాద్ ఆదేశానుసారం

మిగతా 3లో

## ఇంటర పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

### -కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



**టీ మీడియా, ఫిబ్రవరి 17, భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లాలో నిర్వహించనున్న ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 25వ తేదీ నుంచి మార్చి 18వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 37 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు సంబంధిత విభాగాధిపతులను నియమించినట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేలా అనుభవం కలిగిన ఇన్విజిలేటర్లను నియమించాలని ఆదేశించారు.పరీక్షల పర్యవేక్షణ కోసం ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాల భద్రత విషయంలో పూర్తి అప్రమత్తత పాటించాలని సూచించారు. ప్రశ్నాపత్రాల నిల్వ, పంపిణీ, రవాణా ప్రక్రియలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని, సంబంధిత పోలీస్ స్టేషన్లలో స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేసి భద్రత మధ్య రవాణా నిర్వహించాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి అమలు చేసి, సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసరాల ప్రాంతంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఆదేశించారు.పరీక్షలు ముగిసిన అనంతరం జవాబు పత్రాలను అత్యంత జాగ్రత్తగా, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా సంబంధిత మూల్యాంకన కేంద్రాలకు పంపించేందుకు పోస్టల్ శాఖ అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జవాబు పత్రాల సీలింగ్, భద్రతా తనిఖీలు, రవాణా ప్రక్రియలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని, నిర్ణీత కాలవ్యవధిలో గమ్యస్థానాలకు చేరేలా సమన్వయం చేసుకోవాలని సూచించారువిద్యార్థుల సౌకర్యార్థం పరీక్ష నిర్వహించు రోజుల్లో ఉదయం 6.00 గంటల నుంచి 8.00 గంటల వరకు ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచనలు ఇచ్చారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్య శాఖ అధికారులు ప్రతి పరీక్షా కేంద్రంలో అవసరమైన మందులు, ప్రథమ చికిత్స సదుపాయాలు కల్పించి, ఏఎన్ఎంలను అందుబాటులో ఉంచాలని సూచించారు మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపల్, పంచాయతీ శాఖ అధికారులు పరీక్షా కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులను సమకూర్చాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష రాయనున్న విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం ఒక గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఎటువంటి

మిగతా 3లో





## రోడ్డు బాగుచేయమని విద్యార్థుల ధర్నా

**టీ మీడియా, ఫిబ్రవరి 17, తుంగతుర్తి:** సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని పస్తాల గ్రామానికి వెళ్లే రోడ్డు బాగుచేయమని విద్యార్థులు, ప్రజలు రోడ్డు మీద ధర్నా చేశారు. గడచిన పది సంవత్సరాలుగా రోడ్డు పరిస్థితి బాగాలేక గ్రామస్తులు, వాహన దారులు, విద్యార్థులు నానవస్థలు పడుతున్నారు. అయినా కానీ ఎవరూ పట్టించుకోకపోవడంతో విద్యార్థులు మంగళవారం రోడ్డుపై ధర్నా చేశారు. రోడ్డుపై కంకర తేలి, లోతైన గుంతలు పడ్డాయి, గతంలో నేతలు ఇచ్చిన హామీలు, చేసిన శంకుస్థాపనలు కూడా శిధిలావస్థకు చేరాయని విమర్శించారు. మాకు పదిరోజుల్లో సమాధానం రాకపోతే కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా ధర్నా చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు.మా గ్రామానికి ప్రధాన సమస్య అయిన ఈ రోడ్డును త్వరగా పూర్తిచేసి న్యాయం చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు అలాగే కలెక్టర్ అభ్యర్థిస్తున్నట్లు ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. ఇది ఏమైనా కనీసం విద్యార్థులు వచ్చిన చైతన్యం గ్రామంలోని ప్రజలు యువత ముందుకు రాకపోవడం దురదృష్టకరమైన విషయం. తక్షణమే గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులను పరిశీలించి, గ్రామ వార్డు సభ్యులతో మమేకమై మాట్లాడి తక్షణమే నిధులను మంజూరు చేసి కనీసం ఎర్ర మట్టి పోసైన, తేలిన కంకరపై మరమ్మత్తులు చేయాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.



## పుస్తక పఠనాన్ని మించిన సాధనం లేదు : పసుపులేటి వీరబాబు

**టీ మీడియా, ఫిబ్రవరి 17, టేకులపల్లి:** పుస్తక పఠనాన్ని మించిన సాధనం లేదని, టేకులపల్లి గ్రంథాయాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు అన్నారు. టేకులపల్లి శాఖ గ్రంథాలయం టేకులపల్లి పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించడంకై పుస్తక ప్రియుల పాదయాత్ర మంగళవారం టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తక ప్రియులు చాగంటి కృష్ణమూర్తి మాట్లాడుతూ..గ్రంథాలయంపై తనకు 50 సంవత్సరాల అనుబంధం ఉందని, గ్రంథాలయాలు విద్యార్థులకు ఉన్నత స్థానాలకు చేరడానికి ఉపయోగపడుతాయని అన్నారు.ఏదైనా విషయంపై సమగ్ర అవగాహన ఏర్పరుచుకోవాడానికి పుస్తకాన్ని మించిన సాధనం లేదన్నారు. డిజిటల్ యుగంలో పుస్తకాలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విజ్ఞానాన్ని సమకూర్చుకోవడం అవసరమేనని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి గ్రంథపాలకుడు ఆర్ నాగన్న, గ్రావీటి స్కూల్ హెచ్ఎం బ్రహ్మాచారి, టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం మోహన్, ప్రభుత్వ జూనియర్ కాలేజ్ బసవమ్మ, గ్రంథపాలకుడు బాబురావు, ఉపాధ్యాయులు శంకర్, టేకులపల్లి 4వార్డు నెంబర్ జాటోత్ కిరణ్, పీవైఎల్ నాయకులు నోముల భానుచందర్, సీపీఐ మండల కార్యదర్శి గుగులోత్ రాంచందర్ పాల్గొన్నారు.

## కేసీఆర్ జన్మదిన వేడుకలు

**టీ మీడియా, ఫిబ్రవరి 17,తిరుమలాయపాలెం:** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, స్వరాష్ట్ర సాధకుడు, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలను బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భాష బోయిన వీరన్న కొండబాల వెంకటేశ్వర్లు కీసర సంకీర్తన రెడ్డి దేవేందర్ రెడ్డి (మెట్టు వెంకటేశ్వర్లు తెలంగాణ ఉద్యమకారుడు) ఆధ్వర్యంలో తిరుమలాయపాలెం మండల కేంద్రంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో బి బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భాష బోయిన వీరన్న తిరుమలాయపాలెం మాజీ సర్పంచ్ కొండపాల వెంకటేశ్వర్లు కొమ్ము వీరబాబు గొలుసు ఉపేందర్ మద్దినేని లింగయ్య మద్దినేని వెంకటయ్య చలపతిరావు కొలిచలం శ్రీనివాసరావు ఆలేటి రమేష్ విశ్వం కొమ్ముకోటయ్య చుంచు వెంకటేశ్వర్లు పోలే పొంగు బక్కయ్య నేలమర్రి బాబు అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో చలో సెక్రటేరియట్

## వాల్ పోస్టర్లు విడుదల

**టీ మీడియా, ఫిబ్రవరి 17, ఖమ్మం:** ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన డిమాండ్స్ ను పరిష్కరించాలని ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో చలో సెక్రటేరియట్ వాల్ పోస్టర్లు విడుదల చేసిన ఖమ్మం రీజియన్ జేఏసీ నాయకులు. డిమాండ్స్....1.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి 2.. ఆర్టీసీలో యూనియన్లను పునరుద్ధరించాలి..3. 2017 పే స్కేల్ ఏరియాస్ ను వెంటనే చెల్లించాలి 4.. 2021 పే స్కేల్ను అమలుపరచాలి..5. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసి ఆర్టీసీకి అప్పజెప్పాలి.6. ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి7 మహిళల పైన వేధింపులు ఆపాలి మహిళలకు ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల్లో కొద్దిగా డ్యూటీలు వేయాలి 8 ఆర్టీసీలో డి ఎం ఆఫీస్ ఆర్ఎం ఆఫీస్ ఏవో ఆఫీస్ ఖాళీలను భర్తీ చేయాలిరిటర్మెంట్ అయినా ఉద్యోగులకే సెటిల్మెంట్ ఎమ్మటే చేయాలి వారికి రావలసిన బకాయిలు చెల్లించాలి ఆర్టీసీలో కార్మిక సంఘాలను అనుమతించాలి గుర్తింపు ఎన్నికలు జరపాలి అయ్యర్ పెన్షన్ అప్లై చేసుకున్న కార్మికులకి డిమాండ్ నోటీసు రాని వారి అందరికీ డిమాండ్ నోట్స్ ఇప్పించాలి బెడ్ విన్నర్ స్కీమ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలిఉద్యోగస్తులకు ఉద్యోగభద్రత కల్పించాలి. తదితర డిమాండ్లతో..... ఈ నెల 24వ తారీఖు నాడు ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో చలో సెక్రటేరియట్ ముట్టడిని కార్యక్రమంలో పిలుపునివ్వడం జరిగింది ఈ పిలుపులో భాగంగా ఈరోజు ఉదయం ఖమ్మం రీజియన్ ఖమ్మం డిపో జేఏసీ ఆధ్వర్యంలో చలో సెక్రటేరియట్ వాల్పోస్టర్లు విడుదల చేయడం జరిగినది ఈ యొక్క కార్యక్రమం ఉద్దేశించి ఖమ్మం రీజియన్ జేఏసీ కన్వీనర్ పిల్లి. రమేష్ కో కన్వీనర్ ఎల్ ఆర్ కే రావు, ఖమ్మం డిపో నాయకులు బి బుచ్చిబాబు గారు ఖమ్మం డిపో నాయకులు పెద్దపాక వెంకటేశ్వర్లు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు... చలో సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమం విజయవంతం చేయాలని విజయవంతం చేస్తారని ఆశిస్తున్నాము... జై ఆర్టీసీ జై జై ఆర్టీసీ జై జేఏసీ...





## నిబంధనల మేరకు అత్యధిక పరిహారం...

### -జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**టీ మీడియా, ఫిబ్రవరి 17, ఖమ్మం:** సీతారామ ఎత్తిపోతల పథకం సంబంధించి భూ సేకరణకు నిబంధనల మేరకు అత్యధిక పరిహారం మంజూరు చేసి, భూనిర్వాసితుల ఖాతాలకు జమచేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ మంగళవారం సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయలపల్లి గ్రామాలలో సీతారామ ఎత్తిపోతల పథకం నిమిత్తం భూ సేకరణ కు సంబంధిత రైతులతో జిల్లా కలెక్టర్ చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయపల్లి గ్రామాలలో సీతా రామ ఎత్తిపోతల పథకం 13వ ప్యాకేజీ నిర్మాణంలో భాగంగా భూ సేకరణ చేయాల్సి ఉండగా, భూ సర్వే నిర్వహించి అవార్డులు ప్రకటించామని, ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించామని అన్నారు. ప్రాజెక్ట్ రావాలని, అదేవిధంగా రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి, భూసేకరణ చేయాలని ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ప్రాజెక్టుతో సాగునీరు అంది, అక్కడి భూములు సారవంతం అవుతాయన్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూమిలో ఉన్న వ్యవసాయ పంపు సెట్లు, చెట్లు, సుబాబుల్ చెట్లు, ఇతర నిర్మాణాలకు సెపరేట్ గా పరిహారం అందించామని అన్నారు. సుబాబుల్ చెట్లకు అటవీ శాఖ చే అంచనాలు చేయించి, పరిహారం అందించామన్నారు. రైతుల కోరిక మేరకు అటవీశాఖ అధికారులచే మరోసారి పరిశీలనలు చేసి, సుబాబుల్ చెట్ల విషయమై తగు న్యాయం చేస్తామన్నారు. కలెక్టర్ గా తనకున్న అధికారాలు, ప్రభుత్వ నిబంధనల మేరకు గరిష్ట పరిహారం అందజేసినట్లు, భూ నిర్వాసిత రైతులందరూ అంగీకరించి, భూ సేకరణకు సహకరించాలని, పనులకు ఆటంకం కల్పించవద్దని కలెక్టర్ అన్నారు.ఈ సమావేశంలో ఎస్.డి.సి. ఎం. రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, ఇర్రిగేషన్ ఇఇ కె. బాబూరావు, డిఇ ఎస్. కిషోర్, సింగరేణి మండల తహసీల్దార్ ఆనంతుల రమేష్, నిర్వాసిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తొర్రూర్ లో భారీ బందోబస్తు

**టి మీడియా,ఫిబ్రవరి 17,తొర్రూరు :** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపాలిటీ చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్ ఎన్నిక సందర్భంగా మంగళవారం భారీగా పోలీసులు మోహరించారు. సోమవారం జరిగిన అవాంఛనీయ ఘటన నేపథ్యంలో వాయిదా పడ్డ ఎన్నికలు మంగళవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో 144వ సెక్షన్ విధించి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ తెలిపారు. నిన్నటి ఘర్షణల నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. పలువురు బీఆర్ఎస్ నేతలను హౌస్ అరెస్ట్ చేశారు. తొర్రూరులో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అరెస్ట్ అయ్యారు. సత్యవతి రాథోడ్, మధుసూదనాచారి, రవిచంద్ర హౌస్ అరెస్ట్ అయ్యారు.



## సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగుల మందు



**టీ మీడియా, ఫిబ్రవరి 17, భూర్గంపాడు :** బూర్గంపాడు మండలం, సారపాక మేడే కాలనీలో నివసిస్తున్న లాకవత్ వెంకన్న ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది.గతంలో సారపాకలో ఆటో నడుపుతూ జీవనం సాగించిన వెంకన్న, ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఉపాధి కోసం హైదరాబాదు కు వెళ్లి కారు డ్రైవర్గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ, జీవనం సాగిస్తున్నాడు. ఈ మధ్య తన భార్య వేరే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకున్న విషయం హైదరాబాదు లో ఉన్న వెంకన్న కు తెలిసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై తన భార్య ను నిలదీయడంతో తనపై కేసులు పెట్టి వేధింపులకు గురి చేశారని, తీవ్ర మనస్తాపానికి గురైన వెంకన్న సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగుల మందు సేవించినట్లు సమాచారం.అతడిని వెంటనే భద్రాచలం లోని ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి చికిత్స అందిస్తున్నారని, ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది అని స్థానికులు తెలిపారు.

## పంచాయతీ సిబ్బందితో వెట్టి చాకిరి...

### అటెండర్ల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం.

**టీ మీడియా, ఫిబ్రవరి 17, సింగరేణి(కారేపల్లి):** ఖమ్మం జిల్లాలోని సింగరేణి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. లక్షల్లో జీతాలు పొందుతున్న అటెండర్లు కార్యాలయాల్లో కనీస పారిశుద్ధ్య బాధ్యతలు నిర్వర్తించకుండా అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అటెండర్లు చేయాల్సిన పనులను గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులతో చేయించడం విమర్శలకు దారి తీసింది. మండల కార్యాలయంలో చిన్నపాటి శుభ్రత పనులకైనా పంచాయతీ సిబ్బందినే వినియోగించడం అధికారుల నిర్లక్ష్యం తేట తెల్లం అవుతుంది.కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అధికారులు పరిస్థితిని పర్యవేక్షించకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొన్నదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో ముగ్గురు వర్క్ అటెండర్లు ఉన్నప్పటికీ, కార్యాలయ శుభ్రత బాధ్యతలను వారు నిర్వర్తించకుండా గ్రామపంచాయతీ కార్మికులతో కార్యాలయానికి సంబంధించిన పనులను పంచాయతీ సిబ్బందిపై మోపడం సరైన పద్ధతి కాదని , మరోవైపు తక్కువ జీతంతో పని చేసే గ్రామపంచాయతీ కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు అందకపోవటం, అదే సమయంలో వారిని ఇతర కార్యాలయ పనులకు ఉపయోగించడం వెట్టి చాకిరిని తలపిస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, బాధ్యతారాహిత్యమే ఈ పరిస్థితికి కారణమని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిధులతో జీతాలు పొందుతున్న సిబ్బంది విధులు నిర్వర్తించకపోవడం, పంచాయతీ కార్మికులను వెట్టి చాకిరిలా ఉపయోగించడం తగదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



